## గ్రామసభలు ఏర్పాటు

**ప్రజాశక్తి-చింతపల్లి:**పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ధాత్రి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్, పీఎం జన్మన్ కార్యక్రమాల శ్రేణిలో గ్రామ సభలు చింతపల్లి మండలంలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం చౌడుపల్లి, కిటుముల, లోతుగడ్డ, కొమ్మంగి పంచాయతీల పరిధిలోని పకబు, చెరుకుంపాకలు, కొమ్మంగి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శుల సమన్వయంతో ఈ గ్రామ సభలు సాగాయి. ప్రజల సౌకర్యార్థం గ్రామ సభల సందర్భంగా ఆధార్ నమోదు, కొత్త రేషన్ కార్డు పంపిణీ, వైద్య శిబిరాలు, విద్యార్థుల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు, జనధన్ ఖాతాల నమోదు, పీఎం కిసాన్ పథకాలపై ప్రత్యేక సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

హాజరైన మహిళలు

# ఉలిక్కి పడ్డ మన్యం

- ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టు పార్టీ నేతలు మృతి
- పోలీసు వలయంలో ఏజెన్సీ ప్రాంతం
- బిక్కుబిక్కుమంటున్న గిరిజనులు

**ప్రజాశక్తి-రంపచోడవరం**

దేవీపట్నం మండలం కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము ఎన్‌కౌంటర్ జరగడంతో మన్యం ప్రాంతం ఉలిక్కి పడింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు అరుణ, ఎఒబి స్పెషల్ జోన్ కమిటీ ఎసిఎం అంజు మృతి చెందారు. దేవీపట్నం మండలం పాపికొండలు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని అందిన సమాచారం మేరకు పది రోజులుగా పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ అనంతరం అటవీ ప్రాంతాన్ని పోలీసులు తమ కంట్రోల్‌లోకి తీసుకున్నారు. భారీగా సంఖ్యలో పోలీసు బలగాలను దించి తప్పించుకున్న మావోయిస్టుల కోసం అటవీ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నారు. దీంతో ఏజెన్సీ లోతట్టు గిరిజన గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తమ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా మావోయిస్టులు సంచరిస్తున్నారని పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎన్‌కౌంటర్ చేయడంతో అక్కడ గ్రామాలలోని గిరిజనులు తమకు ఏమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. పోలీసు సాయుధ బాలాగాలతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందని గిరిజన గ్రామాలు వణికి పోతున్నాయి. మరో వైపు ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలోనే పాత్రికేయులను సైతం పోలీసులు నిలిపివేశారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద మృతదేహాలకు దగ్గరికి కూడా ఎవరినీ రానివ్వలేదు. ఏరియా ఆసుపత్రిని పూర్తిగా పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు.

**అరకు మాజీ ఎమ్మెల్యేల హత్యలో కీలకం అరుణ**

2018లో డుంబ్రిగుడ సమీపంలో నాటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను హత్య చేసిన సంఘటనలో అరుణ కీలకంగా వ్యవహరించారు. అరుణ స్వస్థలం విశాఖ జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. ఆమె మావోయిస్టు అగ్ర నేత చలపతి భార్య. కాగా చలపతి ఈ ఏడాది జనవరిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

**మావోయిస్టు పార్టీకి ఎదురు దెబ్బ**

**సీలేరు :** దేవీపట్నం అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఎఒబిలో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగలింది. ఒకానొక సమయంలో ఏఓబి మావోయిస్టు పార్టీకి కంచుకోటగా ఉండేది. మావోయిస్టు అగ్ర నాయకులకు ఏఓబి షెల్టర్ జోన్‌గా మలచుకొని ఆంధ్ర, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్రాల్లో వారి కార్యకలాపాలు కొనసాగించేవారు. 2016లో రామగుడ ఎన్‌కౌంటర్‌లో అగ్ర నేత ఆర్కే కుమారుడు మున్నాతో సహా 30 మంది మావోయిస్టులు హతమయ్యారు. అక్కడ నుండి వరుస ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. 2016 తర్వాత మావోయిస్టు పార్టీలో రిక్రూట్మెంట్ కూడా పెద్దగా జరగకపోవడం, నాయకత్వం అనారోగ్యం, వయోభారం వంటి సమస్యలు పార్టీని వెంటాడాయి. దీనికి తోడు ఒరిస్సాలో మావోయిస్టు ప్రభావత ప్రాంతాల్లో ప్రతి చోట పోలీస్ అవుట్ పోస్టులు పెట్టి వారి కార్యకలాపాలను నిలువరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చడమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ పేరుతో చేపట్టిన చర్యలతో ఏడాది వ్యవధిలోనే వందల సంఖ్యలో మావోయిస్టులు హతమయ్యారు. దీంతో ఏఓబిలో మావోయిస్టు పార్టీ కనుమరుగైపోయే పరిస్థితి ఏర్పడింది.

## బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడు మృతి

**ప్రజాశక్తి -సీలేరు :** జికె వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న గంజాయి దామోదరం (50) బుధవారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి మృతి చెందడంతో సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విషాద చాయలు అలముకున్నాయి. పెదబయలు మండలం పరేడ గ్రామానికి చెంది గంజాయి దామోదరం 2023లో సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చి రెండు సంవత్సరాలు విధి నిర్వహణ చేపట్టారు. ఆయనకి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల బదిలీల్లో భాగంగా జోలాపుట్ హైస్కూల్‌కు బదిలీ అయి అక్కడ జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. ప్రభుత్వం బదిలీల ప్రక్రియ పూర్తయ్యే వరకు బదిలీ చేసిన స్థానంలో రిపోర్ట్ చేసి మరల రిలీవ్ అయి పాత పాఠశాలలో విధులు చేపట్టాలని ఆదేశాలు ఉండడంతో జోలాపుట్ పాఠశాలలో మంగళవారం జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి మళ్లీ రిలీవింగ్ ఆర్డర్ తీసుకుని అక్కడ నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరి మంగళవారం సాయంత్రం సీలేరు చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకి లేచి స్థానిక జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణంతో కలిసి వాకింగ్‌కు వెళ్లారు. అనంతరం ఇంటికి చేరుకుని 6 గంటలకు బాత్రూంలోకి వెళ్లారు. అరగంటపైగా సమయం కావడంతో ఆయన భార్య కుమారుడు బాత్రూంలో చూసేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి స్పందించి వైద్యసేవలందించారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వెంటనే మెరుగైన నిమిత్తం నర్సీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. ఏపి జెన్కో భవ్య ఆస్పత్రి ఆధీనంలో ఉన్న సిఎస్ఆర్ అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే బ్రెయిన్ స్కానింగ్ తీసి పరిశీలించి మృతి చెందారని చెప్పారు. అనంతరం ఆయన మృతదేహాన్ని స్వగ్రామం పరేడ తరలించారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎంపిపి, ఉపాధ్యాయులు భగీరథ మాట్లాడుతూ దామోదరం మృతి తీరని లోటని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

దామోదరం చిత్రపటం వద్ద సిబ్బంది, విద్యార్థుల నివాళులు (ఇన్‌సెట్‌లో) దామోదరం

## సాగుభూముల జోలికొస్తే సహించేది లేదు

**ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్**

**ప్రజాశక్తి - విఆర్ పురం:** చిన్న మట్టపల్లి పంచాయతీ పరిధిలో వెంకంపాలెం చిన్నమటపల్లి కన్నాయిగూడెం గుండుగూడెం 4 గ్రామాలకు గ్రామసభ స్థానిక సర్పంచ్ పిట్ట రామారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ గ్రామాలకు సంబంధించిన 3వేల ఎకరాల భూములు ఫారెస్ట్ అధికారులు పాపికొండల నేషనల్ పార్క్ పేరుతో ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్నటువంటి భూములు కావాలని ఫారెస్ట్ అధికారులు కోరారు. ఎంపిటిసి పూనెం ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పోడు సాగు చేస్తున్న భూములు జోలికి వస్తే ఊరుకునేది లేదని ఫారెస్ట్ అధికారులను హెచ్చరించారు. అదేవిధంగా ఎకో సెన్సిటివ్ జోన్ పేరు చెప్పి ఆదివాసుల భూములు లాక్కోవాలని చూస్తే ఆదివాసులని ఐక్యం చేసి తిరుగుబాటు చేస్తామని ఫారెస్ట్ కార్యాలయం ముట్టడి చేస్తామని డిమాండ్ చేశారు. ఆదివాసీలంతా ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్

## విధి నిర్వహణలో ఎంఇఒ అలసత్వం

**ప్రజాశక్తి - విఆర్ పురం:** మండలంలో పనిచేస్తున్న ఎంఇఒ లక్ష్మీనారాయణ తను ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడంలో అలసత్వం వహిస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షురాలు కారం లక్ష్మి ఆరోపించారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇంకా కొన్ని చోట్ల బడి తలుపులు తీయలేదని తన దృష్టికి వచ్చిందని ఆ విషయమై ఎంఇఒకి ఫోన్ చేద్దామని చూసినా అందుబాటులోకి రాలేదన్నారు. ఆయన కొన్ని వారాలుగా కార్యాలయానికి రావడం లేదని సమాచారం అందిందన్నారు. ఎప్పుడు ఫోన్ చేసినా ఎటపాక మండలం, లేదంటే చింతూరు మండలంలో ఉన్నానని కుంటి సాకులు చెబుతూ ఉద్యోగ బాధ్యతను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. కావున వీఆర్‌పురం మండలానికి ప్రత్యేకమైన ఎంఇఒని నియమించాలని డిఇఒ, కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు సోయం చినబాబు ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్ మండల కమిటీ సభ్యులు కారం సుందరయ్య పోడియంశ్రీరామ్ మూర్తి, పీసా సెక్రెటరీ వేటగాని సూరి, పీసా ఉపాధ్యక్షులు సారా పాండురాజు ఖాదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు..

మాట్లాడుతున్న ఎంపిడిఒ కేఆర్ విజయ తదితరులు

### 'దర్తీ ఆబజన భగీరథి'పై అవగాహనా సదస్సు

**ప్రజాశక్తి - అడ్డతీగల:** స్థానిక మండల కేంద్రం డి.భీమవరంలో ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమాలపై ప్రజలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ కేఆర్ విజయ, డిప్యూటీ ఎంపిడిఒ చిన్న పాల్గొన్నారు. డి.భీమవరం సర్పంచ్ చెక్క శంకర్‌బాబు అధ్యక్షత వహించారు. ప్రధానంగా బాగా వెనుకబడిన కొండరెడ్డి వర్గానికి సంబంధించిన వారికి అన్ని విషయాల్లో అభివృద్ధి చెందించడమే దీని లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం జూన్ 15 నుండి 30 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ విజయ ,డిప్యూటీ ఎంపిడిఒ చిన్నా వివరించారు. ఇతర మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సచివాలయం కార్యదర్శి, సచివాలయం సిబ్బంది హాజరయ్యారు.

పిఒ అపూర్వ భరత్‌కు వినతిపత్రం ఇస్తున్న రేఖపల్లి గ్రామస్తులు

### ముంపు నష్టపరిహారం అందించాలి

**ప్రజాశక్తి - విఆర్ పురం:** రేఖపల్లి గ్రామాన్ని ప్రయారిటి హేబిటేషన్‌లో చేర్చి నష్టపరిహారం అందించాలని రేఖపల్లి గ్రామస్తులు చింతూరు పిఒ అపూర్వ భరత్‌ను బుధవారం కలసి విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు పీసా అధ్యక్షుడు సారా పాండురాజు, కార్యదర్శి వేటగాని సూరి మాట్లాడుతూ రేఖపల్లి ముంపులో ఉంది కాబట్టి ప్రభుత్వ రాయితీలు వరి విత్తనాలు, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలు అందించాలని కోరారు. స్పందించిన పిఒ ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీఇచ్చారు. గ్రామపెద్దలు తాతబాబు, మాదిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

**- ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల**

**ప్రజాశక్తి- అరకులోయ:**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ఏ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల స్పష్టం చేశారు. బుధవారం అరకులోయ సందర్శించిన ఆమె అల్లూరి, మన్యం జిల్లా నాయకులు కార్యకర్తలతో స్థానిక పర్యాటకశాఖ పున్నమిలో సమావేశం నిర్వహించి పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన నిర్ణయాలు,అభిప్రాయాలు, సలహా సూచనలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో నిజాయితీ కలిగింది ఒక కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆమె అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలను గాలికొదిలి పని చేస్తున్నారని ఆమె అన్నారు. ప్రజలకు అండగా నిలబడి పోరాటం చేస్తున్నది పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆమె తెలిపారు. ప్రజా సమస్యలపై, ఏపీకి ప్రత్యేక హెూదాపై బిజెపితో పోరాడుతున్నది కాంగ్రెస్ పార్టీ యేనని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి, మన్యం జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైయస్ షర్మిల

# పిఎం జన్‌మన్ గృహాల బిల్లులు చెల్లించాలి

**-ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్**

మాట్లాడుతున్న బాలదేవ్

**ప్రజాశక్తి- అరకు లోయ:**పీఎం జన్ మాన్ హౌసింగ్ బకాయి బిల్లులు విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ధర్నా విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, పీఎం జన్మన్ హౌసింగ్ పథకం 2023న భారత ప్రభుత్వం ప్రారంభించిందని ఈ పథకం అల్లూరి జిల్లాలో అత్యంత వెనుకబడిన పివిటిజి తెగల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి పక్క గృహాలు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బకాయి సొమ్ము రూ. 21 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 27న పాడేరు ఐటిడిఏ వద్ద నిర్వహించే ధర్నాకు పీఎం జన్మన్ లబ్ధిదారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పీవీటీజీ లకు ఇళ్లు, తాగనీరు, రోడ్డు విద్యుత్, విద్య, వైద్యం అనేది ప్రాథమిక హక్కు అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని విస్మరించి ఆదివాసీ ప్రాంతంలో ఉన్న సహజ వనరులను దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ ఆదివాసీ ప్రజల పట్ల లేదన్నారు. అత్యంత మారుమూల ప్రాంతంలో నివసిస్తున్న వేలాది మంది పివిటిజి తెగలకు కనీస సౌకర్యాలు అందని ద్రాక్షగా మారిందని నేటికీ పాడేరు ఐటీడీఏ పరిధిలో 700 గ్రామాలకు కనీస రోడ్డు సౌకర్యం లేక వైద్యం కోసం డోలి మోతలే శరణ్యమవుతుందన్నారు. పాడేరు ఐటీడీఏ పరిధిలో సుమారు 28570 వేల మంది పివిటిజిలకు ఇళ్లు మంజూరు చేశారని, ఒక్కొక్కరికి రూ.3.39 లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు పెంచకపోవడంతో పివిటిజి తెగలు తీవ్రమైన అప్పులు పాలయ్యారని తెలిపారు. ఇళ్ల నిర్మాణ బకాయి సొమ్ము రూ.21 కోట్లు ప్రభుత్వం చెల్లించక పోవడంతో ఇళ్లు నిర్మాణం పూర్తి కాలేదని వర్షాలకు, చలి తీవ్రతకు లబ్ధిదారులు తీవ్రమైన ఇబ్బందికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతగిరి మండలంలో 616 మందికి రూ.89 లక్షలు, అరకువేలి మండలం 1989 మందికి కోటి 69 లక్షలు, డుంబ్రిగుడ 849 మందికి 70 లక్షలు, హుకుంపేట 1211 మందికి కోటి 59 లక్షలు, మంచింగిపుట్టు 3137మందికి 4 కోట్ల 57 లక్షలు, పెదబయలు 2180 మందికి 3 కోట్ల 6 లక్షలు, పాడేరు 1503 మందికి కోటి 94 లక్షలు,జి. మాడుగుల 2572 మందికి 2 కోట్ల 51 లక్షలు, చింతపల్లి 2478 మందికి కోటి 86 లక్షలు, జి. కె వీధి 1744 మందికి 2 కోట్ల 63 లక్షలు, కొయ్యూరు మండలం 476 మందికి 50 లక్షలు బకాయి సొమ్మును వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈనెల 27న పాడేరు ఐటిడిఏ పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. మన్యంలోని వివిధ మండలాలకు చెందిన పీఎం జన్మన్ లబ్ధిదారులు ఈ ధర్నాకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారుఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి.బుజ్జిబాబు, మండల నాయకులు జగన్నాథం, రామన్న, బుజ్జిబాబు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌వైజర్లకు ఘన సత్కారం

**ప్రజాశక్తి-హుకుంపేట:**హుకుంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టులో గ్రేడ్ వన్ సూపర్వైజర్లుగా విధులు నిర్వర్తించి, మైదాన ప్రాంతాలకు బదిలీ అయిన వారికి బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ శాఖ సిడిపిఓ జి.సువర్ణ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు మాట్లాడుతూ, ఏజెన్సీ ఐటిడీఏ పరిధిలో పనిచేసిన వారందరినీ నిజాయితీగా మైదాన ప్రాంతాలకు బదిలీ చేచడంపై కృతజ్ఞతలు తెలిపారు. హుకుంపేట ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం తన జీవితంలో మరువలేని అనుభవమని చెప్పారు.సిడిపిఓ జి.సువర్ణ మాట్లాడుతూ, సూపర్వైజర్లు ందించిన సేవలు గుర్తిండి పోతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కె. హసీనా బేగం, డి. అప్పలనరసమ్మ, కె. హైమావతి, అంగన్వాడీ టీచర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్లను సత్కరిస్తున్న సిబ్బంది

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలు ఆపడం సరికాదు

**మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** నెలకు రూ.12 వేలు లోపు వేతనాలు పొందుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింప చేయకపోవడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. తల్లికి వందనం బాధితులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గ్రంధి గౌరి పిల్లల ఫీజు నిమిత్తం రూ.5 వేలు సొంత నిధులను గణేష్ కుమార్ ఆమెకు అందజేశారు. బుధవారం ఆశీలుమెట్ట కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అవుట్ సోర్సింగ్ కారణంగా తల్లికి వందనం పథకం పొందలేని వారు ఎందరో ఉన్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులందరికీ అమ్మఒడి అందించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, వడ్డాది దిలీప్, కోన శంకర్, దశమంతుల మాణిక్యాలరావు పాల్గొన్నారు.

### పలు రైళ్లకు కోచ్‌ల పెంపు

**ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ :** ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి పలు రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన అదనపు కోచ్‌లలను పెంచాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 07027/07028 చర్లపల్లి-బ్రహ్మాపూర్- చర్లపల్లి స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 13 నుంచి, బ్రహ్మాపూర్ నుంచి బయలుదేరే ట్రైన్‌కు ఈ నెల 14వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన ఒక 3వ ఏసీ కోచ్‌ను పెంచనున్నారు. 17243/17244 గుంటూరు-రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 18వ తేదీ నుంచి గుంటూరులో, ఈ నెల 19వ తేదీ నుండి రాయగడ లో బయలుదేరే రైళ్లకు శాశ్వత ప్రాతిపదికన రెండు స్లీపర్ క్లాస్, ఒక 3వ ఏసీ కోచ్‌లను జతచేయనున్నారు

బస్‌ను ప్రారంభిస్తున్న దొన్నుదొర

### ఆర్‌టిసి బస్ ప్రారంభం

**ప్రజాశక్తి-అరకులోయ:**అరకులోయ మండలం అరకు వ్యాలీ నుంచి లోతేరుకు నూతనంగా ఆర్టిసి బస్ సర్వీసును ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియారి దొన్నుదొర బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులను స్వయంగా చూశానని, అందుకే ఏపీఎస్‌ఆర్టీసీ సర్వీసులను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పాడేరు నుంచి కందమామిడి, చీకు మద్దే నుంచి పాడేరుకు రెండు బస్సులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. తాజాగా లోతేరుకు మరో నూతన సర్వీసును ప్రారంభించామని ప్రారంభించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమామహేశ్వరరావు, అరకులోయ మండల పార్టీ ప్రెసిడెంట్ లోక్కోయి మహాదేవ్, పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, మాదల సర్పంచ్ వంతల శ్రీనివాస్, పెదలబుడు వైస్ సర్పంచ్ పాడి చందు నిర్మల, పెదలబుడు వార్డ్ మెంబెర్ నాగరాజు, కిముడు త్రినాధ్, మాజీ మండల ప్రెసిడెంట్ శెట్టి బాబురావు, మాజీ ఎంపిటిసి కిల్లో కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

| | |
|---|---|
| సిటీ : 9490099125 | పూర్ణమార్కెట్ : 9490099676 |
| మధురవాడ : 8008596645 | జగదాంబ : 9490099434 |
| గాజువాక : 9849392359 | జివియంసి : 9490099483 |
| అనకాపల్లి : 8008736188 | ద్వారకానగర్ : 9490099672 |
| చోడవరం : 9490099141 | కంచరపాలెం : 9490099135 |
| నర్సీపట్నం : 9440280411 | మాదవధార : 9490099675 |
| పాడేరు : 9490099142 | |
| రంపచోడవరం : 9440165617 | |

## 'తల్లికి వందనం' నగదుకు పడిగాపులు

బ్యాంకుల వద్ద గుమిగూడిన తల్లులు

**ప్రజాశక్తి-చింతపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుండగా ఈ సొమ్ము డ్రా చేసుకునేందుకు తల్లులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. చింతపల్లి, జీకే వీధి మండలాలకు చెందిన మహిళలు చింతపల్లి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్, గ్రామీణ బ్యాంకులతో పాటు ఏటీఎంలు, స్పైస్ మని వంటి ప్రైవేట్ లావాదేవీల కేంద్రాల వద్ద నగదు కోసం గంటల తరబడి బారులు తీరారు. ఈ బ్యాంకులు సాంకేతిక సమస్యలు అంటూ బోర్డులు ఏర్పాటు చేసి లావాదేవీలను నిలిపేయడంతో తల్లులు నిరాశ చెందారు. మూడు రోజుల నుంచి వస్తున్నా, ఇంకా డబ్బు చేతికి రాలేదు అంటూ ఓ లబ్ధిదారిణి ఆవేదన వ్యక్తం చేశారు. మరో తల్లి మాట్లాడుతూ పొద్దున్నే వచ్చాం, మధ్యాహ్నం అయినా తన వంతు రాలేదు. గంటల తరబడి బ్యాంకు ఎదుట నిల్చొన్నామన్నారు. దూర గ్రామాల నుంచి ప్రయాణించి వచ్చిన తల్లులు రవాణా ఖర్చులు భరించి ఖాళీ చేతులతో వెనుదిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఎదురవుతోంది. వర్షంలో తడుస్తూ, గొడుగులు పట్టుకుని క్యూ లైన్లలో నిలబడుతున్న దృశ్యాలు చూస్తే వారి ఆవేదన స్పష్టంగా అర్థమవుతోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, బ్యాంకులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ బ్యాంకింగ్ వాహనాలు, ప్రత్యేక నగదు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై కఠినచర్యలు

- డుంబ్రిగుడ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- సిసిల పై చర్యలేవంటూ వెలుగు ఎపిఎంను నిలదీసిన సభ్యులు

మండల సభలో ప్రశ్నిస్తున్న సభ్యురాలు

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే అటువంటి వారిపై చర్యలు తప్పదని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపిపి బి ఈశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమయానికి సభ్యుల కోరం హాజరు కాకపోవడంతో సమావేశం సుమారు పదకొండున్నర గంటలకు ప్రారంభమైంది. ఈ సందర్భంగా గసభ పంచాయతీలో డ్వాక్రా మహిళలకు చెందిన సొమ్మును వారికి చెల్లించకుండా అక్రమాలతో పాటుగా సిసిపై చర్యలు ఇప్పటివరకు ఎందుకు తీసుకోలేదని ఎంపిటిసి సభ్యులు సర్పంచులు ఏపీఎంను నిలదీశారు. దీంతో స్పందించిన ఆమె ఈ విషయంపై విచారణ చేపట్టడం జరిగిందని ఇంకా చర్యలు తీసుకోలేదని సమాధానం ఇచ్చారు. మిషన్లు పంపిణీ చేసేటప్పుడు సభ్యులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని, ప్రతి సమావేశంలో ప్రోటోకాల్ కు సంబంధించి ఎన్నిసార్లు చెప్పినా అధికారులు ప్రోటోకాల్ ఎందుకు పాటించడం లేదని ఏపీఎంను సభ్యులు నిలదీశారు. కంద్రం పంచాయతీ ఒంబి రోడ్డు కల్వర్టులు నాణ్యత ప్రమాణాలకు పాటించకుండా నాసిరకంగా నిర్మించడంతో ఆ కల్వర్టు కూలిపోయిందని తక్షణమే దీనిపై చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్ పిఆర్ జేఈఈను నిలదీశారు. కల్వర్టు నాణ్యతగా నిర్మించేంతవరకు బిల్లులు చెల్లించకుండా నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే పి.ఆర్ జేఈఈను ఆదేశించారు. పీఎం జన్మన్ పథకం ద్వారా మంజూరైన గృహ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తక్షణమే అటువంటివి మానుకోవాలని లేనిపక్షంలో ఇకనుంచి అటువంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత హౌసింగ్ అధికారులపై వేటు తప్పదని ఎమ్మెల్యే హౌసింగ్ అధికారులను హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపీపీ లలిత, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని, కురిడి సచివాలయాన్ని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం సందర్శించి పరిశీలించారు. ఉదయం 10 గంటలైనా మండల కేంద్రం సచివాలయంలో సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడంపై వారికి జీతాలు నిలుపుదల చేయాలని ఎంపీడీవో ప్రేమ్ సాగర్ ను ఆదేశించారు.

## మోటూరు హనుమంతరావుకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** ప్రజాశక్తి దినపత్రిక వ్యవస్థాపక సంపాదకులు, సిపిఎం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కామ్రేడ్ మోటూరు హనుమంతరావు 24వ వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. మోటూరు చిత్ర పటానికి ప్రజాశక్తి ఎడిషన్ సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ మోటూరు హనుమంతరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలిపారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఎంపీగా పీడిత ప్రజల తరపున తన గళాన్ని వినిపించారని తెలిపారు. ప్రజాశక్తి సంపాదకులుగా సున్నితమైన పదజాలంతో సూటిగా తెగిలే విధంగా సంపాదకీయాలు రాసేవారన్నారు. విశాలాంధ్రకు ఎనిమిది సంవత్సరాలు సంపాదకునిగా ఉన్న ఆయన ఆ తరువాత ఆయన సంపాదకత్వంలోనే ప్రజాశక్తి దినపత్రిక ప్రారంభమైందని చెప్పారు. ఆయన వేసిన పునాదులతోనే నేడు ప్రజాశక్తి ఈ స్థితికి చేరిందని తెలిపారు. అందరితో చాలా స్నేహపూర్వకంగా, నిరాడంబరంగా మెలిగేవారన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. సబ్ ఎడిటర్ ఆర్కే.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎడిషన్ సమన్వయ కమిటీ సభ్యులు టి.అప్పలరాజు, ప్రజాశక్తి ఉద్యోగులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

యోగా చేస్తున్న అధ్యాపకులు

**ప్రజాశక్తి - చింతూరు :** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ప్రశాంతత వస్తుందని చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రత్న మాణిక్యం అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం యోగాసనాల అభ్యసన చేపట్టారు. యోగాసనాలపై అవగాహన పెంచుకుని ప్రతిరోజు చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో ప్రశాంతమైన జీవన విధానాన్ని పెంపొందించుకో వచ్చునన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శేఖర్, అధ్యాపకులు జి.వెంకటరావు, డాక్టర్ వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, కె.శకుంతల, జి.హారతి, కె.శైలజ, ఎమ్.నాగమోహన్‌రావు, ఆర్.మౌనిక, మూర్తి, సంగంనాయుడు, శీనయ్య, సుబ్బారావు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాతృభాష విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదివాసి మాతృ భాషా విద్యా వాలంటీర్లను తక్షణమే రెన్యువల్ చేసి విధులోకి తీసుకోవాలని ఆ సంఘం సభ్యులు రమేష్, నాగేంద్ర కోరారు. ఈ సందర్భంగా వారు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశిష్ట సేవలు అందిస్తున్న ఆదివాసి మాతృభాషా విద్య వాలంటీర్లు 2025-2026 విద్యా సంవత్సరానికి తక్షణమే పునరుద్ధరించి వీధులకు పంపాలన్నారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన సరికాదన్నారు. ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత నైపుణ్య అభివృద్ధికి విద్యా వ్యవస్థకు ఎంతో ప్రాధానిత్యానిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న ఆదివాసి మాతృభాష విద్య వాలంటీర్లను రెన్యువల్ చేయకపోవడంతో విద్య వ్యవస్థను కుంటి పడే పరిస్థితి ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో 676 మంది కువి, ఆదివాసి ఒరియా, కొండ దొర బాషలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రైమరీ పాఠశాలలకు ఉన్నతమైన విద్యాభ్యాసించి బోధించడంలో వాలంటర్లు ప్రాథమిక విద్యలో నిరంతరం శ్రమిస్తున్నారన్నారు.

## టిడిపి నేత వీర్రాజు మృతి

వీర్రాజు (ఫైల్ ఫొటో)

**ప్రజాశక్తి- హుకుంపేట:** గడికించుమండ పంచాయతీ దొంతురై గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఓలేసి వీర్రాజు (50) మంగళవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చెన్నైలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హుకుంపేటలో నాగార్జున సిమెంట్ ఏజెన్సీ స్థాపించి ప్రజలలో విశ్వాసాన్ని అందుకున్న వీర్రాజు, సామాజిక సేవా రంగంలోనూ చురుకైన పాత్ర పోషించారు. తెలుగుదేశం పార్టీలో అహర్నిశలు శ్రమించి, సర్పంచ్‌గా సేవలందించారు. ఆయన మృతిపట్ల తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## మండల వ్యవసాయ అధికారిగా మురళీకృష్ణ

అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :** మండలంలో నూతన వ్యవసాయ అధికారిగా మురళీకృష్ణ బాధ్యతలను బుధవారం వ్యవసాయ కార్యాలయంలో స్వీకరించారు. మండల వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని ఆదివాసి గిరిజన రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తానన్నారు. సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయాన్ని చేపట్టి అధిక దిగుబడులు, మంటలు పండించే విధంగా రైతులకు అవగాహన పరుస్తారని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా రేగిడి ఆముదాలవలస మండలంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడ వచ్చారని తెలిపారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

**ప్రజాశక్తి -తగరపువలస :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పలువురు సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం చిట్టివలస జ్యూట్‌మిల్లు కల్యాణ మండపంలో సిఐటియు భీమిలి మండల మహాసభ జరిగింది. ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన ఈ సభలో సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, వచ్చేనెల 9 జరగనున్న అఖిల భారత పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. స్టీల్ ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు ఎస్ అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, ఎం.రాము, వి నాగరాజు పాల్గొన్నారు.

అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సిఐటియు మండల కమిటీ అధ్యక్షులుగా నీలాతి రాము, కార్యదర్శిగా జి శ్రీను, ఉపాధ్యక్షులుగా పల్లా పెంటరాజు, సహాయకార్యదర్శిగా ఎం ఈశ్వరరావు, కోశాధికారిగా ఎస్ వెంకట సత్యం ఎన్నికయ్యారు.

## కొయ్యూరు ఎఒగా భానూప్రియాంక

భానూప్రియాంక

**ప్రజాశక్తి - కొయ్యూరు :** కొయ్యూరు మండల వ్యవసాయ అధికారిగా భానూప్రియాంక బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో వారం రోజుల్లో రైతులకు, సబ్సిడితో కూడిన వరి విత్తనాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. సాగుపై త్వరలో అన్ని గ్రామాల రైతులకు సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటివరకూ పనిచేసిన వ్యవసాయ అధికారి ఉమాదేవి బదిలీపై విశాఖపట్నం వెళ్లారు.

## పాఠశాలకు మరమ్మతులు

**ప్రజాశక్తి - కూనవరం:** మండలంలోని కొండాయి గూడెంలో ఉన్న పాఠశాల ఎన్నో ఏళ్లుగా కురుస్తున్నా స్థానిక అధికారులు నాయకులు పట్టించుకోలేదని ఇదే క్రమంలో ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్‌కి తెలియజేయడంతో స్వచ్ఛంద సంస్థ సమారిటర్న్ ఫర్ ది నేషన్ సహకారంతో 2 లక్షల వ్యయంతో మరమ్మతులు చేయించి అందంగా తీర్చి దిద్ది నందుకు స్టానిక ఎంపిటిసి జయసుధ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మడకం పోద్దయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమస్య పరిష్కరించినందుకు సిపిఎం మండల కార్యదర్శి బాబు బోర్రయ్య మాట్లాడుతూ మండలంలోని విద్యకు సంబంధించిన మౌలిక వసతులు ప్రభుత్వమే కల్పించాలన్నారు. కూనవరం కూటూరు, బురదగూడెం, తాలగుమ్ము, పాలగూడెం వంటి ప్రాథమిక పాఠశాలలో వర్షాలు వస్తే కురుస్తున్నాయని గుర్తు చేసారు. సమావేశంలో జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కమిటి సభ్యులు కర్నాటి శ్రీనివాసరావు, ఆవుల మురళి తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందుకుంటున్న కాంగ్‌శుభ

## బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కో కన్వీనర్‌గా కాంగ్ శుభా

**ప్రజాశక్తి - కొయ్యూరు :** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదిక కో కన్వీనర్‌గా కాంగ్ శుభా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గురుగుబెల్లి దామోదర్ బుధవారం ఆమెకు నియామక పత్రం అందించారు. పరిరక్షణ వేదిక అల్లూరి సీతారామ రాజు జిల్లా నుంచి కొయ్యూరు మండలానికి చెందిన రత్నంపేట గ్రామానికి చెందిన పాటి చంద్రశేఖర్, జిల్లా కో కన్వీనర్‌గా నియమితులయ్యారు.

## బావి బాగుచేయరూ..!

**ప్రజాశక్తి -సీలేరు:** జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రుస్యాగూడలో తాగునీటి బావి శిథిలావస్థకు చేరుకుందని జనసేన నాయకులు డొక్కుబాబు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. రుస్యాగూడలో 15 కుటుంబాలు నేల బావిపై ఆధారపడి జీవిస్తున్నారు. జల్‌జీవన్ పథకంలో భాగంగా ప్రభుత్వం బోరు, కుళాయిలు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఆ నీటిని వినియోగించడానికి గిరిజనులు ఆసక్తి కనబరచడం లేదు. ఎప్పటినుంచో బావిలో నీటిని సేకరించి తాగునీటికి, ఇతర అవసరాలకు గ్రామస్తులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. బావి శిథిలావస్థకు చేరడంతో లోపల మొక్కలు పెరిగిపోయాయి. మొక్కల్ని తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ ఎటువంటి చర్యలు చేపట్లేదు. అధికారులు స్పందించి బావి బాగుచేయాలని కోరుతున్నారు.

# యోగాంధ్రతో ట్రాఫిక్ కష్టాలు

**నగర పరిధిలో సుమారు 5 కిలోమీటర్లకు పైగా ట్రాఫిక్ జామ్**

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నం బీచ్ రోడ్డులో సుమారు 25 కిలోమీటర్ల మేర నిర్వహించనున్న యోగా దినోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి బీచ్ రోడ్డు పూర్తిగా మూసివేయడంతో విశాఖపట్నం ప్రజలకు ఎన్నడూ లేని విధంగా ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో విశాఖపట్నంలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ ట్రాఫిక్ సుమారుగా మూడు నుండి ఐదు కిలోమీటర్ల మేర స్తంభించిపోయింది. పలు ప్రాంతాల్లో అంబులెన్సులు, అత్యవసర వాహనాలు, కళాశాలల బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర అవస్థల పాలయ్యారు. భీమిలి బీచ్ రోడ్డు నుండి ఆర్కె బీచ్ వరకు పూర్తిగా బీచ్ రోడ్డును మూసివేశారు. ఆ రహదారిలో ప్రయాణించే ట్రాఫిక్‌ను ఎన్ హెచ్ - 5 మీదికి మళ్లించడంతో అటు శ్రీకాకుళం నుండి వచ్చే వాహనాలు ఇటు పెందుర్తి, సింహాచలం నుండి వచ్చే వాహనాలు ఒక్కసారిగా హనుమంతవాక కూడలికి చేరుకొని సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ నెలకొంది. విశాఖ నగరంలోని అప్పుఘర్ పార్కు నుండి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్రమైన రద్దీ ఉంటుంది ఈ వాహనాలన్నిటిని ఒక్కసారిగా ఇసుకతోట హైవే వైపుకు మళ్లించడంతో నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, ద్వారకా నగర్, సీతంపేట, రైల్వేస్టేషన్, మద్దిలపాలెం, జగదాంబ జంక్షన్ ప్రాంతాల్లో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆంక్షలు మొదలుపెట్టిన తొలిరోజే ఇలా ఉంటే మరో మూడు రోజులు ఈ ఆంక్షలు కొనసాగనున్న నేపథ్యంలో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు ప్రణాళికలు రూపొందించి, రానున్న మూడు రోజులు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

**ట్రాఫిక్ సిబ్బంది కొరత**

ఎప్పటినుండో విశాఖపట్నం పోలీస్ శాఖలోని ట్రాఫిక్ విభాగాన్ని సిబ్బంది కొరత సమస్య వేధిస్తోంది. దీనికి తోడు అధిక శాతం సిబ్బందిని విఐపిల ప్రయాణ మార్గాల్లో పని చేసేందుకు కేటాయించడంతో ఇతర మార్గాల్లో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు సిబ్బంది లేకుండా పోయారు. ట్రాఫిక్ మళ్లింపుపై ముందస్తు ప్రణాళికలు లేకుండా ఆంక్షలు విధించారంటూ పోలీస్ శాఖపై ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుండి విశాఖపట్నం చేరుకోవాల్సిన అదనపు బలగాలు ఇంకా విశాఖ రాకపోవడంతో ఉన్న సిబ్బందితోనే అధికారులు పనిచేస్తున్నారు. సాధారణంగా జూ నుండి మద్దిలపాలెం రావడానికి కేవలం 15 నిమిషాలు పట్టే ప్రయాణ సమయం బుధవారం గంటన్నరకు పైగా పట్టిందని ఒక క్యాబ్ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాఫిక్ కారణంగా డిఎస్‌సి పరీక్షకు ఆలస్యమైందని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారులు మంత్రుల తాకిడి**

మూడు నాలుగు రోజులుగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, రాష్ట్ర మంత్రులు మొత్తం విశాఖలో యోగాంధ్ర ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. వివిధ ప్రాంతాల్లో సమీక్షలు, సమావేశాలు, పరిశీలన అంటూ తిరుగుతుండడంతో విఐపి ప్రోటోకాల్ కారణంగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాన్వాయిలు వెళుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ముందుగానే ఆపేయడంతో పలు ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మాట్లాడుతున్న వై.అశోక్

## ఎపి జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ తరగతులు

**ప్రజాశక్తి - మోతుగూడెం :** అల్లూరి జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెంలో మంగళవారం స్థానిక ఎస్‌సి, ఎస్టి అసోసియేషన్ బిల్డింగ్‌లో శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణను భారత ఆర్మీలో 22 సంవత్సరాలు వైద్యుడుగా లెఫ్టినెంట్ కల్నల్ కేడర్‌లో పనిచేసి కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న రిటైర్డ్ అధికారి లెఫ్టినెంట్ వై.అశోక్ ఉద్యోగులకు ఆరోగ్యం మనస్సు అనే విషయాలపై శిక్షణ అందించారు. అనేక ప్రమాదాల్లో ప్రాథమిక చికిత్స చేయకపోవడం వలన పలువురు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని ప్రమాదాల్లో ప్రాథమిక చికిత్స ఎలా చేయాల్లో తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిత్వాన్ని ఎలా పెంపొందించుకోవాలి అనే విషయంపై కూడా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక చీఫ్ ఇంజనీర్ డి.చిన కామేశ్వరరావు, ట్రైనింగ్ సెంటర్ చీఫ్ ఇంజనీర్ బి. శ్రీధర్ అధికారులు, ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

## 2028 నాటికి శత శాతం సేంద్రియ వ్యవసాయం





చెక్కును అందజేస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి-పాడేరు:** జిల్లాలో 2028 నాటికి శత శాతం సేంద్రీయ వ్యవసాయం సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ సూచించారు. రైతులకు అందించిన వ్యవయాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాల పొందిన రైతులు, వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయాల పరిధిలో మెకనైజేషన్ ఆంతర్యం లేకుండా సర్వే చేసి ఎంత మేరకు వ్యవసాయ పరికరాలు అవసరమైవు తాయో ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఎంత మంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారు ? పంటలకు యూరియా, పొటాషియం, పురుగుల మందులు ఎంత మంది వినియోగిస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పరికరాలు రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని రైతులకు ఎలా తెలిసిందని ఆరా తీసారు. సేంద్రీయ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి చర్యలు చేపట్టామన్నారు. నీడ తోటలకు మద్ది, నేరేడు, పనస మొక్కలను రైతులకు ఉపాధి హామీ పథకంలో పంపిణీ చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బిఎస్ నంద్ మాట్లాడుతూ 351 మంది రైతులకు రూ.1.26 కోట్ల విలువైన వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసామన్నారు. 95 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, 29 మందికి ట్రాక్టర్లు, 59 మంది పవర్ టిల్లర్లు, 13 బ్రెష్ కట్టర్లు, 155 మందికి పవర్ వీడర్లను 50 శాతం రాయితీపై అందించడం జరిగిందన్నారు. అనంతరం వరి విత్తనాలను పంపిణీ చేసారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, అరకు వ్యాలీ, పాడేరు, వి.మోహనరావు, ఝాన్సీలక్ష్మి, ఎం.వి. శ్రీనివాస్, డిపిఎం ఎస్.జె.వి. రామ మోహనరావు, కుమార్, వ్యవసాయాధికారులు, గిరిజన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మహిళలు

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి 38వ వార్డు పరిధి బుక్కా వీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం సిఐటియు జగదాంబ జోన్ కమిటి ఆధ్వర్యంలో మహిళలు ధర్నా చేపట్టారు. సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని మరో సింగపూర్, ముంబై చేస్తామని చంద్రబాబు చెపుతున్నారని, మంచినీరు సరఫరా చేయలేనివారు ఈ నగరాన్ని ఉద్ధరిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనేక నెలల నుండి మంచినీటి సమస్యపై మహిళలు నిరసన తెలియజేస్తున్నా జివిఎంసి అధికారులకు కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. 38వ వార్డులో రోడ్లన్నీ తవ్వేసి నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా బాగుచేయలేదని విమర్శించారు. మంచినీటి కుళాయిల పైపులైన్లలో మురుగునీరు కలసిపోతోందని అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా, కనీసం స్పందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల కిందట కలెక్టర్‌ను కలిసి సమస్య గురించి వివరిస్తే నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా జివిఎంసి అధికారులు హామీ ఇచ్చినా నేటికీ పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా మంచినీరు ఇచ్చి ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యం కాపాడాలని, లేనిపక్షంలో యోగా రోజున బీచ్ రోడ్డులో మహిళలతో యోగా చేసి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, సూరాడ లక్ష్మి, సత్య, రామలక్ష్మి, ఎల్లయ్యమ్మ, రమ, అమర సత్య, చందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## 20, 21 తేదీల్లో తీరంలో చేపల వేట వద్దు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** విశాఖపట్నం తీర ప్రాంతంలో ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి, పలువరు ప్రముఖులతో పాటు లక్షలాది మంది ప్రజలు హాజరు కానున్నారు.

తీర ప్రాంత రక్షణ దృష్ట్యా ఈనెల 20, 21 తేదీలలో ఫిషింగ్ హార్బర్ నుండి భీమిలి వరకు గల తీర జలాలలో చేపల వేట నిలుపుదల చేసి సహకరించాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. తీర పోలీస్ శాఖ కోరినందున ఆ రెండు రోజులు భీమిలి ఫిషింగ్ హార్బర్ మధ్య తీర జలాలలో చేపల వేట నిలుపుదల చేయాలని కోరింది.